# టర్న్ ది పేజ్

## జయంతి వెంకట రమణ

**మేనేజర్‌గారు** పిలుస్తున్నారన్న ప్యూన్ విన్నపాన్ని విని, చేస్తున్న పని నాపి మేనేజర్ గదిలోకి వెళ్ళి టేబిల్ దగ్గర నిలబడబోతున్న శ్రీరామ్, ఆ టేబిల్‌కి ఒక పక్క నిలబడిన ఆమెను చూసి 'స్వర్గానికి పోయినా సవతిపోరు తప్పదా' అనుకున్నాడు.

మేనేజర్ అతని మనసులో ఆలోచనను కనిపెట్టిన వాడిలా నవ్వుతూ, "ను వ్వనుకునేదేదీ కాదోయ్, శ్రీరామ్. ఈమె మన ఆఫీసుకి కొత్తగా ఎపాయింట్ అయి వచ్చిన క్లర్కు

కృష్ణమూర్తి ట్రాన్స్‌ఫర్ తరువాత ఆ సీటు కూడా నువ్వే చూస్తున్నావుగా. ఇప్పుడు నీకు పని తగ్గింది. ఆ వర్కు ఈమెకు హేండోవర్ చెయ్యి. బై ది బై, ఒక వారం రోజులపాటు ఆమెకు కొద్దిగా హెల్పు చెయ్యి. కొత్తకదా. అంతే. అది చెప్పడానికే పిలిచాను" అంటూ చూస్తున్న ఫైలులోనికి తల దూర్చాడు, ఇక మీరు వెళ్ళవచ్చునన్నట్టు.



సెలవు తీసుకొని ఇద్దరూ బయట పడ్డారు.

టైప్ చేసిన కాగితాలు పట్టుకుని లోపలికి వెళ్ళబోతున్న శంకరం ఇద్దర్నీ మార్చి మార్చి చూసి ముందుకు వెళ్ళబోయేవాడల్లా ఆగి శ్రీరామ్‌ను పక్కకు లాగి,"ఏమిటీ! ఆఫీసులోనే పెళ్ళిచూపుల కార్యక్రమం పెట్టేశాడా ఏమిటి మేనేజర్?" అన్నాడు కళ్ళజోడు సవరించుకుంటూ.

"అబ్బే! అదేం కాదు. ఈమె కృష్ణమూర్తి ప్లేస్‌లో వచ్చిన క్లర్కు న్యూ ఎపాయింట్‌మెంట్।"

"ఓహో! తెలిసింది. ఆ సీటూ నువ్వే చూస్తున్నావు కదూ! వెళ్ళు, వెళ్ళు" అంటూ చెయ్యి వదిలాడు. శ్రీరామ్‌కోసమే నిలబడిన ఆమె అతను రాగానే అతనితోపాటు కదిలింది. ఆమె ముఖం చూడగానే శంకరం మాటలు వినపడి ఉంటాయన్నది నిర్ధారణ అయింది.


"సారీ! మీ రే మనుకోకండి. అతని తీరే అంత. ఈ పక్క సీటే మీది. ఇది నాది" అంటూ ఆమె సీటు చూపించాడు శ్రీరామ్.

ఆమె ఏదో రహస్యం గ్రహించినట్టు అతని వేపు చూస్తూ తల ఊపింది. "రాస్తున్న డ్రాఫ్టు ముగించి ఒక్క అయిదు నిముషాలలో వస్తాను. కూర్చోండి" అని చెప్పి తన సీటుకు వెళ్ళిపోయాడు శ్రీరామ్.

డ్రాఫ్టు రాయటం ముగించి ఫైలు కట్టేస్తూ తలతిప్పిన శ్రీరామ్‌కి కుర్చీలో పొందికగా కూర్చుని, తల కొద్దిగా ముందుకువంచి టేబిల్‌మీద చూపుడువేలితో ఏదో రాస్తున్న ఆమె కనిపించింది. ఆమె నలా చూడగానే 'ఈమె నెక్కడో చూసినట్టుందే' అనిపించింది శ్రీరామ్‌కి. కాని, ఎక్కడ చూసినదీ జ్ఞాపకం రాలేదు. మనిషిని పోలిన మనుమ లుండవచ్చుని సరిపెట్టుకున్నాడు.

ఆమెకూడా తలఎత్తి కాటుక రేఖలలోంచి బెరుకుగా అతని వంక చూసింది. ఆ చూపులు అతనికి అందంగా కనిపించాయి. 'అందమైనదే' అనుకున్నాడు. 'ఇంతమంది (అంటే ఎంతమందనో అర్థం) ఆడపిల్లల్ని పెళ్ళిచూపుల్లో చూశాను. ఈమెలా ఏ ఒక్కరున్నా పెళ్ళి చేసుకొనే వాడినే కదా. ఖర్మ!' అంటూ తన సీటులోంచి లేచి ఆమె టేబిల్‌వేపు వెళ్ళాడు. అతన్ని చూసి ఆమె నిలబడింది.






ఆమె ఛార్జిలో ఉండాల్సిన ఫైల్సును ఆమెకు అందించి, ఆమె చేయాల్సిన పనులేమిటో తెలియజెప్పాడు. ఆమె బెరుకు బెరుకుగానే చూస్తూ అన్నీ విన్నది.

"మనది పెద్ద ఆఫీసు. జిల్లాలో ఎన్ని ప్రాంతాలనుంచో మనకు ఎన్నో రకాలయిన మహజర్లు వస్తుంటాయి. మీ సీటుకు చెందిన వాటిని మీకే పంపుతారు. కాగితం రాగానే దాన్ని టేబిల్‌లోకి తోసేయక, ముందుగా అది ఏ ఫైలులోకి వెళ్ళాలో చూసి ఆ ఫైలులో ఉంచడం ముఖ్యమైన పని. అలా చేయకపోతే కాగితాలన్నీ కలగాపులగం అయి మనకు తలనొప్పి తెప్పిస్తాయి. వీలయినంత త్వరలోనే అందులో ఉన్న విషయం ఏమిటో చూడాలి. ఈ కాగితానికి ముందుగా ఏమైనా వాళ్ళు ఉత్తరమూ లకంగా పంపుకున్నారేమో చూడాలి. రిఫరెన్సులు తిరగవెయ్యాలి. ఇంతవరకు ఫరవాలేదు. అటు తరువాతే సమాధానంగా ఏం రాయాలో తెలియక, ఖచ్చితంగా చెప్పాలంటే వర్కు తెలియక ఫైలు పెంచుతారు. ఎన్ని సంవత్సరాలయినా సమస్యలు తెగవు. మన చేతగానితనానికి ఎందరో బలవుతూంటారు. కాబట్టి మనవల్ల ఒకరు నష్టపోయారన్న మాట రాకూడదు. తెలియనిది తెలుసుకోవడంలో తప్పు లేదు. అంతమాత్రం చేత మనం చిన్నవాళ్ళమయిపోము. వర్కు తెలుసుకోడానికి సులభ పద్ధతేమిటో తెలుసా! 'టర్న్ ది పేజ్', 'టర్న్ ది పేజ్ అండ్ లెర్న్ ది వర్కు' అని మనవారు ఊరకే అనలేదు. ఇప్పటికే చాలా వాగి మీకు బోర్ కొట్టాననుకుంటాను. అందుచేత ఇప్పుడు నేను ఫినిష్ చేసిన మీ సీటు ఫైలే చూడండి" అంటూ ఆమెకు ఓపికగా వివరించి చెప్పాడు. ఆమెకూడా ఓపికగా, ఉత్సాహంగా విన్నది. అప్పటికే లంచ్ టైమ్ అయిపోయింది. టిఫిన్ బాక్సులు తెచ్చుకున్న వాళ్ళు టిఫిన్ చేయడానికి ఉపక్రమిస్తున్నారు. కాంటీన్‌కి వెళ్ళేవారు వెళ్తున్నారు.

"ఇప్పటి కిది చాలు. రేపు ఈ కాగితం చూడండి. దీనికి ప్రాణం ఎలా పోయవచ్చో ఆలోచించండి. నేను కాంటీన్‌కి వెళ్తున్నాను. ప్యూన్‌చేత కాఫీ, టిఫిన్ పంపిస్తాను" అంటూ కదలిపోయాడు శ్రీరామ్.

"అబ్బే! మీ కెందుకండీ శ్రమ" అని ఆమె అన్నదేమో. ఆమె పెదవులు కదిలాయి. కాని శ్రీరామ్‌కేమీ వినపడలేదు.

కాఫీ సిప్‌చేస్తూ శ్రీరామ్ ఆమెగురించే ఆలోచించాడు. 'తానెన్ని మాటలు మాటాడినా ఆమె ఒక్క మాటయినా మాటాడలేదు. చెప్పినదంతా శ్రద్ధగా విన్నది. మంచమ్మాయే' అనుకున్నాడు శ్రీరామ్.

తిరిగి తన సీటులోకి వస్తూంటే "థాక్సండీ" అం దామె పర్సు తీస్తూ. "దాన్దే ముందండి. ఉంచండి. కొత్తలో ఎవరో ఒకరు సాయపడకపోతేగాని కాదుకదా. ఆ ఖాళీ సీటు చూశారుగా. ఆ సీటు శకుంతల గారిది. ఆమె సెలవులో ఉన్నారు. ఆమె వస్తే మీకు ఒంటరితనం ఉండదు" అంటూ తన సీటులోకి చేరాడు శ్రీరామ్.

ఇంటి కెడుతూకూడా అనుకున్నాడు—'ఈమె నెక్కడో చూసినట్టుందే' అని. ఎక్కడన్నది మాత్రం గుర్తుకు రాలేదు.

"మీ సెక్షన్ కెవరో అమ్మాయి వచ్చినట్టుంది. మీ రిద్దరూ చాలా సేపు మాటాడుకున్నారట.

పేరేమిటి?" అని అడిగాడు రంగారావు.

అతని కేం సమాధానం చెప్పాడో గుర్తులేదు గాని 'అవును, పేరు తెలుసుకుని ఉంటే బాగుండేదే' అని ఆలోచించాడు శ్రీరామ్.

ఆ మర్నాడు ఎంతాలోచించినా ఆమె పేరెలా తెలుసుకోవటమో అర్థం కాలేదు.

సాయంత్రం ఇంటికెళ్ళే ముందు మేనేజర్ పిలిచి "ఉమాదేవి వర్కు పికప్ చేస్తోందా!" అని అడిగాడు.

"ఉమాదేవి ఎవరండి?" అని అడిగాడు.

"అదేమిటయ్యా, అలా అంటావు? కృష్ణమూర్తి ప్లేసులో వచ్చిన క్లర్కు. అటెండెన్సు రిజిస్టరులో ఇంతేసి అక్షరాలతో ఉంది—చూడలేదూ పేరు? ఇంటి దగ్గర నీ గురించి చాలా చెప్పింది. చాలా ఓపికగా ఆమెకు వివరించావట. 'శ్రీరామ్ చాల మంచివారు, అంకుల్' అంది. బై ది బై, ఉమ నా మేనకోడలు" అన్నాడు.

శ్రీరామ్ వీపు మీద చరిచినట్టయింది.

ఆమె పేరు తెలిసినందుకు సంతోషం కలిగింది గాని, అలాంటి పేరెప్పుడూ విన్నట్టు అనిపించలేదు. ఆమె తన గురించి మంచివాడని కాంప్లిమెంట్ ఇచ్చినందుకు ఆనందం కలిగింది.

నెల రోజులు గడిచాయి.

ఈ నెల రోజుల్లో ఉమాదేవి బాగా వర్కు నేర్చుకొంది. డ్రాఫ్టింగ్ కూడా బాగా అభివృద్ధయింది. శకుంతలతో స్నేహం కూడా అధికమైంది. శ్రీరామ్ ఎంత చొరవ తీసుకున్నా అవసరాన్ని మించి ఒక్కమాట మాటాడటం మాత్రం లేదు. శ్రీరామ్ కూడా ఆమెను బట్టి మెలగక తప్పలేదు. కాని అతని మనసులో మాత్రం ఉమాదేవి రూపం ముద్ర పడిపోయింది. అది చెరగని ముద్ర అని అతనికి తెలుసు. తన మనసును ఆమె కెలా చెప్పాలా అని మథనపడుతూనే మరో నెల గడిపాడు. 'చెపితే ఆమె తిరస్కరి స్తేనో' అనుకుంటూ మరో నెల గడిపాడు.

మరో వారం, పది రోజుల్లో ఒక్కొక్క రోజు చొప్పున రెండుసార్లు సెలవు పెట్టింది. శకుంతలే శ్రీరామ్‌ను పిలిచి చెప్పింది.

"ఉమ ఈమధ్య ఎందుకు సెలవు పెడుతోందో తెలుసా?" అని అడిగింది.

"ఎందుకు?"


"శూన్య మాసం పోయిందిగా!"

అంటే?"

"ఇంకా అర్థం కాలేదా? పెళ్ళిచూపులకి ఎటెండ్ అవుతోంది. మొన్న రెండో పెళ్ళివాడు చూసి వెళ్ళాడట. ఈ సారి ఏ మూడో పెళ్ళివాడో అని గొణుక్కుంటూ వెళ్ళింది సెలవు పెట్టి" అందామె శ్రీరామ్ ముఖం చూస్తూ.

"రెండో పెళ్ళి వాడినో, మూడో పెళ్ళి వాడినో చేసుకోవలసిన అగత్యమేమి టామెకు?" తీవ్రంగా అడిగాడు శ్రీరామ్.

"బాగుందయ్యా! నీ లాంటి పెళ్ళికొడుకులంతా పదేసి, పదిహేనేసి వేలు కట్నమంటూ, దానికి తగ్గ లాంఛనాలంటూ చెట్టెక్కి కూర్చుంటే మధ్య తరగతి కుటుంబాలలో పుట్టిన ఆడపిల్లల పెళ్ళిళ్ళ సంగతేమిటి?" అడిగిం దామె.




"నేనెప్పుడూ అంతేసి కట్నాల నడగలేదు, శకుంతల గారూ! కాకపోతే అమ్మాయి బాగుండాలన్నాను. అది కుదరకే గాని కట్నం వల్ల కాదు" అన్నాడు.

"నేను నిన్ననలేదయ్యా! నిన్నెందుకంటాను? నీ సంగతి నాకు తెలుసుగా. నేనే ఒకసారి ఉమతో 'శ్రీరామ్ మంచివాడు. మాటాడమంటే మాటాడతాను. నా మాట కాదనడు' అంటే ఏమందో తెలుసా? 'దయచేసి అతని ముందు ఈ ప్రస్తావన తేకండి' అంది. ఆమె ఆంతర్యమేమిటో నా కర్థం కాలేదు" అందామె.

శ్రీరామ్‌కి అటు తరువాత ఏ పనీ చేయ బుద్ధి పుట్టలేదు. ఆ రోజు రాత్రి భోజనం చేసి ఇవతలికి వస్తూంటే కనిపించాడు 'చలపతి'. 'ఎప్పుడొచ్చావ్?'అని శ్రీరామ్ పలకరిస్తూంటే, "ఉమాదేవి పనిచేసేది మీ ఆఫీసులోనే కదా?" అని అడిగాడు చలపతి, మిఠాయి కిళ్ళీ నములుతూ.

"అవును. ఇంతకీ ఎందుకు?" అన్నాడు శ్రీరామ్ గుండె దడదడ లాడుతూంటే.

"ఇవ్వాళ ఆమె ఆఫీసుకి సెలవు పెట్టింది కదా!"

"అవును. ఎందు కిన్ని ప్రశ్నలు?" అడిగాడు అసహనంగా.

"ఇకముందు అనవసరంగా సెలవులు వృథా చేసుకోవద్దని చెప్పు. పెళ్ళి చూపుల కోసమయితే అసలు వద్దని చెప్పు. ఆ గంగిరెద్దుకి అసలు పెళ్ళవదని చెప్పు."

"ఏమిటి నీ వంటున్నది?" అన్నాడు శ్రీరామ్ దిగ్భ్రాంతితో.

"ఇంకా అర్థం కాలేదా? 'ట్యూబ్‌లైటు'. 'నిన్న మిమ్మల్ని చూసిన చలపతికి మీరు నచ్చలేదట' అని ఉమాదేవి గారితో రేపు ఆఫీసులో చెప్పు. అర్థమైందా? అసలు నీ వాలకం చూస్తే ఈ మాట చెప్పేటట్టు లేవు. నేనే వాళ్ళ పెద్ద వాళ్ళకి రాస్తాలే. నీవేం దిగులు పడకు. ఇంతకీ నీ పెళ్ళెప్పుడు?" అని ప్రశ్న వేసి సిగరెట్ వెలిగించుకుంటూ సమాధానం కోసం వేచి ఉండక "ట్రైన్‌కి టయిమ్ అవుతోంది" అంటూ చరచరా సాగి పోయాడు చలపతి.

చలపతికి ఉమాదేవి నచ్చనందుకు శ్రీరామ్‌కి ఎంత ఆనందం కలిగిందో, చలపతి ఆమెను గంగిరెద్దన్నందుకు అంత కోపమూ కలిగింది.

ముద్దబంతి పువ్వులా, ముత్యాల ప్రోగులా, నడిచే వెన్నెలలా, సోగ కళ్ళతో, కోటేసిన ముక్కుతో అందంగా ఉండే ఈమె గంగిరెద్దులా చలపతి కంటి కెందుకు కనపడిందో అర్థంకాలేదు.

ఆ రాత్రి కలత నిద్రలో ఉమాదేవి అతన్ని పలుసార్లు పలుకరించి పోయింది.

ఆఫీసులో ప్రతి రోజులాగే కనపడిం దామె.

చలపతి అన్న మాటలే పదే పదే అతనికి వినిపిస్తూంటే పని మీదకు ధ్యాస పోలేదు శ్రీరామ్‌కి.

లంచ్ టయిమ్‌కి ముందు ఉమాదేవి ఒక ఫైలు పట్టుకుని చరచరా శ్రీరామ్ దగ్గర కొచ్చింది. "చూడండి, శ్రీరామ్ గారూ! ఒక వ్యక్తికి ఒక హక్కు ఉన్నప్పుడు దానిని మనం కాదనవచ్చా!" అంది ఒక పిటీషన్‌ను చూపిస్తూ. శ్రీరామ్ ఆ పిటీషన్ చదివాడు.

"ఎలా కాదనగలం!" అన్నాడు శ్రీరామ్.

"అయితే చూడండి. ఈ ఫైలు మీద ఎలా అడ్డంగా రాసేశారో కృష్ణమూర్తి గారు, జి. ఓ. నంబరుకూడా కోట్ చేస్తూ. ఈ జి. ఓ. మీద క్లారిఫికేషన్ కూడా వచ్చింది. ఆ క్లారిఫికేషన్ కూడా చూడకుండా 'వీల్లేదు'పొమ్మంటూ రాశారు. ఇది అన్యాయం కాదా? దీని వలన ఇంకంబెంట్ నష్టపోవటం లేదా? అతను మరల అర్జీ పెట్టుకున్నాడు, ఫలాని జి.ఓ. ప్రకారం నాకు ప్రొవిషన్ ఉందని." శ్రీరామ్ ఫైలు చక చక చదువుతూ తిరగ వేస్తూంటే ఉమాదేవి అక్కడి కాపేసింది.

"మీరు ఫేవరబుల్‌గా రాయచ్చు" అన్నాడు శ్రీరామ్.

"అర్జీదారుకి ఫేవరబుల్‌గానే రాశాను. అయితే ఒక మాట. నేను వచ్చిన మొదటి రోజున మీరు 'టర్న్ ది పేజ్ అండ్ లెర్న్ ది వర్క్' అన్నారు గుర్తుందా? ఇప్పుడిలాంటి సందర్భాలలో తప్పులు చేసే అవకాశముంది కదా" అంది.

"అవును, అన్నాను. 'టర్న్ ది పేజ్ అండ్ కాపీ ది వర్క్' అని అనలేదు కదా. లెర్న్ ది వర్క్ అనే అన్నాను.ఇలా వెనక్కి చూడటం వల్ల ఎలాంటి తప్పులు చేయకూడదో తెలుస్తాయి కదా. మనంకూడా బుద్ధితో వ్యవహరించాలి గాని గుడ్డిగా కాదు కదా" అన్నాడు శ్రీరామ్.

ఉమాదేవి ఏదో గ్రహించిన దానిలా—

ఎస్, అర్థమైంది. 'టర్న్ ది పేజ్' అనటంలో చాలా అర్థముంది.థాంక్స్" అంటూ ఫైలు పట్టుకుని వెళ్ళిపోయింది.

చలపతి అన్న మాటల్ని ఉమాదేవికి గాని, శకుంతలాదేవికి గాని చెప్పలేక పోయాడు శ్రీరామ్. చెప్పనా, మాననా అని అనుకుంటూండగానే వారం రోజులు గడిచి పోయాయి. అప్పటికి చలపతి ఉత్తరం రాసే ఉండాలి.

పదిరోజుల తరవాత, ఆనాటి మధ్యాహ్నం లంచ్ టైముకి ముందుగా జెట్ వేగంతో శ్రీరామ్ ఉన్న గదిలోకి దూసుకుంటూ వచ్చాడతని బాబాయి. వస్తున్నవాడు ఊపిరి కూడా సరిగా తీసుకోకుండా "ఆఫీసులో ఉన్నావు కదా. మంచిది. మీ ఆఫీసర్ని కనుక్కున్నాను. ఇప్పుడు ఇన్ స్పెక్షన్ లాంటి వేవీ లేవన్నాడు. అందుచేత రెండురోజులు సెలవుపెట్టు. మనం అన్నవరం వెళ్ళాలి, ఈ సాయంత్రం బస్సులో" అన్నాడు.

"ఇప్పు డన్నవరం ఎందుకు, బాబాయ్?" అన్నాడు శ్రీరామ్ గొంతుక తగ్గించి.

శ్రీరామ్ ఎంత గొంతు తగ్గించాడో, అతనంత గొంతు పెంచి "ఎందుకేవిట్రా? ఏదో సామెత చెప్పినట్టుంది. అక్కడో ఫస్టుక్లాస్ సంబంధం ఉంది. రేపుదయం 7.30, 8.30 లోగా చూసేయా లమ్మాయిని. వివరాలు దారిలో చెప్తాను గాని పద, పద" అంటూ తొందర చేశాడు.

ఆ గదిలో మరో ఇద్దరున్నారని, వారు అతని మాటలు వింటున్నారని గ్రహించిన శ్రీరామ్ "నే నిప్పుడు రాలేను గాని నీకో విషయం చెప్తాను పద" అంటూ ఆగకుండా అతనిని జీడి మామిడిచెట్ల కిందికి లాక్కెళ్ళాడు.

"నే నిక ఏ అమ్మాయినీ చూడను. మా ఆఫీసులో నా ప్రక్క సీటులో ఉన్న ఉమదేవి నాకు ఇష్టమైంది. ఆ అమ్మాయి ఇష్టం మాత్రం నాకు తెలియదు.నీకు చేతనైతే ఆ సంబంధం కుదుర్చు. చేతకాకపోతే నా ఊసు ఎత్తకు. నేను పర్మిషన్ తీసుకుని రూమ్‌కి వెళ్ళిపోతాను. నీ వేం చేస్తావో నాకు తెలియదు. సాయంత్రం మాత్రం ఏ సంగతి నాకు చెప్పు" అంటూ కేంటీన్‌కి లాక్కెళ్ళాడు.

బాబాయి కోసం ఎదురు చూస్తున్న శ్రీరామ్‌కి, అతడు పిడుగులాంటి వార్తను తెచ్చాడు ఆ సాయంత్రం।

"ఈ అమ్మాయి ఒకప్పుడు నీవు చూసి కాదన్నమ్మాయే!"

"వ్వాట్?"

"అవును, ఈ అమ్మాయిని నీవు చూసి కాదన్నావు. నేను, మీ పిన్ని నీ వెంట వచ్చాము ఆ పెళ్ళి చూపులకి."

"అబద్ధం. ఈ అమ్మాయిని నే నెప్పుడూ చూడలేదు. అసలు ఈ పేరు గల అమ్మాయిని చూసినట్టు గుర్తేలేదు."

"చెప్తా నాగు. ఈ అమ్మాయి సుందర్రామ్మూర్తి కూతురు. మా పెద్దకోడలికి దగ్గర సంబంధం. వీళ్ళ నాన్న నాకు బాగా తెలుసు. ఒకసారి మనం అనకాపల్లి వెళ్ళాం గుర్తుందా? ఒక సాయంత్రం వేళ... రిక్షా కూడా దొరకకపోతే మనం నడచివెళ్ళాం... సుమారు రెండు సంవత్సరాల క్రితం..."

"కొబ్బరి చెట్టున్న పెంకుటిల్లు..."

"అవును. అది సుందర్రామ్మూర్తి ఇల్లు."

"కాని ఆ అమ్మాయి ఈమె కాదు."


"ఆమె, ఈమె ఒకరే... నీవు సరిగా చూడలేదు కాబోలు."

"సరిగానే చూశాను. ఆయన కింకా కూతుళ్ళు ఉండొచ్చుగా. ఈమె అక్క కాబోలు."

"కాదు, ఈమే- అప్పటికి, ఇప్పటికి పెళ్ళికున్నది ఈమే. ఇద్దరక్కలకి ఎప్పుడో పెళ్ళయిపోయింది."

"నీవేదో నన్ను ఆట పట్టిస్తున్నావు. నాకు ఆ రోజు... ఆ ఇల్లు... ఆ గాలి చొరని గది... ఓల్టేజి తక్కువయిన దీపం... నీలం అంచు ఎఱ్ఱ పట్టు చీరలో ... తలనిండా ఇన్ని చామంతిపూలు పెట్టుకుని... తల వాల్చుకుని కూర్చున్న ఆ అమ్మాయి నాకు గుర్తు... 'కనీసం ఆ కిటికీ అయినా తెగవండి. ఆ అమ్మాయి చెమటతో తడిసిపోతోంది' అని పిన్ని అనటం కూడా నాకు గుర్తు" అన్నాడు శ్రీరామ్.

"కనీసం ఫాన్ అయినా పెట్టించలేకపోయారనో... లేక ఆ సాయంత్రం వేళ పెళ్ళిచూపు లేమిటని నీవు అంటున్నా లాక్కెళ్ళామనో, లేక... టిఫిన్ అయినా పెట్టకుండా డికాక్షన్ లాంటి కాఫీ ఇచ్చారన్న కోపం చేతనో... బస్సుస్టాండుకి వచ్చే దారిలోనే చెప్పేశావు 'నా కా అమ్మాయి నచ్చలే'దని." గుర్తుకు




తెస్తూ అన్నాడు శ్రీరామ్ బాబాయి.

"సిల్లీ! నీవన్నవేవీ కావు. ఆ వాతావరణం... ఆ ఇల్లు... నా కే మాత్రం ఇష్టాన్ని కలిగించలేదు. పోనీ అన్నిటిని సరిపెట్టుకుని చూదామనుకుంటే అప్పుడామె ఎలా ఉందో తెలుసా, బాబాయ్... గంగి..."

"గంగి...? ఎవరు?"

"కాదు... కాదు. చలపతి కూడా ఇదే మాటన్నాడు... బాబాయ్, ఇప్పుడొప్పుకుంటున్నాను. ఆ అమ్మాయి, ఈ అమ్మాయి ఒకరే."

"ఒప్పుకున్నావా? నీవింత తర్కిస్తున్నావే గాని ఆ అమ్మాయి చెప్పనే చెప్పింది, తనను నీవు పెళ్ళి చూపులకని వచ్చి చూశావని, నచ్చలేదని. మొదటిరోజే నిన్ను గుర్తు పట్టిందట...'ఇప్పుడు మాత్రం అతను నన్ను ఇష్టపడతారన్నదేముంది?' అంది... 'అయినా ఒకసారి కాదన్న తరవాత మళ్ళీ పిల్లను చూడండని మా పెద్ద వాళ్ళెలా పిలుస్తా'రంది..." ఆగాడు బాబాయి.

"నీవేమన్నావు, బాబాయ్?" ఆత్రంగా అడిగాడు శ్రీరామ్.

"పెళ్ళిచూపుల అవసరమే లేదన్నాను. ఒక్కసారి మీ పెద్దవాళ్ళ చెవిలో 'శ్రీరామ్ ఇక్కడే పని చేస్తున్నా'డని చెప్పమన్నాను. వాళ్ళే కథను తవ్వి పునాదులేసి ఇల్లు కట్టిచ్చి 'ఇద్దరూ ఇందులో కులాసాగా జీవించండి' అంటారన్నాను. శ్రీరామ్ ఇష్టపడుతున్నాడన్న మాటను కూడా వాళ్ళ చెవిని వెయ్యమన్నాను" అన్నాడు బాబాయి నవ్వుతూ.

"థాంక్స్, బాబాయ్! థాంక్స్. ఇంకా కథలు రాస్తున్నావా ,బాబాయ్?" అడిగాడు శ్రీరామ్.

"తీరిక ఎక్కడిదిరా? పెళ్ళికొడుకుల్ని, పెళ్ళికూతుళ్ళను వెతకటంతోనే సరిపోతూంది.... సరే. మీ నాన్నకి ఫోన్ చేద్దాం పద" అంటూ లేచాడు బాబాయి.

×× ×× ××

"ఆనాడు నిన్ను కాదన్నానని నీకు నా మీద కోపం వచ్చింది కదూ!" అడిగాడు శ్రీరామ్ ఉమ ముఖాన్ని తన వేపు తిప్పుకుంటూ.

"అప్పుడేమో గాని ఇప్పుడు లేదు.

అప్పుడు మీరే కాదు, ఎవరు చూసినా నన్ను కాదనే వారే. తప్పు మీది కాదు. మా వాళ్ళది. ఇద్దరక్కయ్యల పెళ్ళిచూపుల్లో అచ్చి వచ్చిందని ఆ ఎఱ్ఱని పట్టు చీర నాకు చుట్టపెట్టారు. అదే మొదటిసారి పెళ్ళిచూపులకని కూర్చోటం. భయం ఒక ప్రక్క గాలి రాక ఊపిరాడక చెమట ఒక ప్రక్క పువ్వుల బరువుకి జారిపోయే మా వదిన వేసిన సవరం ఒక ప్రక్క... ఆ క్షణంలో నే నెలా ఉన్నానో నాకే తెలియదు. మీరు వెళ్ళిన తరువాత అద్దంలో ముఖం చూసుకున్న నేను కాటుక కరిగిన చెమటతో ఎలా ఉన్నానో నేనే చెప్పలేను. మీరు కాదన్న తరవాత నే నెవరికీ నచ్చనేమో అనే భయం నాలో ఏర్పడిపోయింది. అటు తరవాత నాలుగైదు పెళ్ళిచూపులు అదే గదిలో అదే పద్ధతిలో జరిగాయి. ఇక్కడ జరిగిన పెళ్ళిచూపుల్లో కూడా ఆ గది తప్ప మిగతా తంతు అంతా మామూలే. మీరు ఆ రోజున 'టర్న్ ది పేజ్' అన్నారు, ఫైలు చూపించి. ఇప్పుడు నా లైఫ్ పేజీనే తిరగేసుకుని సరిచూసుకున్నాను. ఇలా నా లాంటి ఆడపిల్ల లెందరో?" అని ఒక్క బిగిని చెప్పాలనుకుంది ఉమ. కాని చెప్పలేకపోయింది. కారణం? ఆమెకది మొదటిరాత్రి. తలవంచి సిగ్గుతో ఆమె నవ్విన నవ్వునే అర్థం చేసుకున్నాడు శ్రీరామ్. ●